మహబూబ్‌నగర్
నాగర్‌కర్నూల్
జోగులాంబగద్వాల్
నారాయణపేట
వనపర్తి

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
17వ వసంతంలోకి

బుధవారం 21 ఫిబ్రవరి 2024 | పేజీలు 8

## రసాభాసలో
# ఎవరి పాత్ర ఎంత?

- కాంగ్రెస్‌లో లీడర్ క్యాడర్ మధ్య సమన్వయలోపం?
- దూసుకు పోయిన మాజీ, తాపీగా తాజా
- ప్రేక్షకులుగా అధికారులు
- నిద్రావస్థలో కాంగ్రెస్

**ని**యోజకవర్గంలోని సిర్సవాడ జడ్పీ పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమం రసాభాసగా మారడం, మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్ధన్‌రెడ్డి ఆయన అనుచరులపై పోలీస్ కేసు నమోదు కావడం నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఇందులో మొదట అధికారులను దోషులుగా చూపుతూ కాంగ్రెస్ కార్యకర్తలు రెచ్చిపోవడం తమ తప్పేమిలేదంటూ అధికారులు నేరుగా తమ విదులకు ఆటంకం కల్గించారంటూ మాజీతో ఎమ్మెల్యే మర్రిజనార్ధన్ రెడ్డితోపాటు ఆయనఅనుచరలపై ఫిర్యాదుచేయడం జరిగింది. విద్యాశాఖ అధికారుల వైఫల్యం, పోలీసుకేసు, నాయకుల ప్రవర్తన తదితర అంశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్త మవుతున్నాయి. ఇందులో విద్యాశాఖాదికారులను బాద్యులను చేయడం ఏంటన్నది ఒకటి కాగా మాజీ ఎమ్మెల్యే అలాఎలా చేస్తాడు అన్నది మరొకటి. ఈ రెండు కాదు అసలు తప్పు మాజీ దూసుకు పోతున్నా ముందస్తుగా నిలువరించడంలో విఫలమై తాపీగా వ్యవహరించిన కాంగ్రెస్ పార్టీకార్యకర్తలు వారి నాయకులైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలదే నన్న వాదనలు కూడా ఉన్నాయి. ఓటమిని జీర్ణించుకోలేని మాజీ వేస్తున్న ఎత్తుగడలు రహస్యమేమీకాదు. దాన్నినివారించ డంలో ప్రస్తుతం గెలుపొందిన వారు సరైన రీతిలో స్పందించడంలేదన్న అభిప్రాయం కూడా కాంగ్రెస్‌తోపాటు ఇతర రాజకీయ పక్షాలు విభిన్న వర్గాల్లో కూడా వినిపిస్తున్నది.

*– నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మేజర్‌న్యూస్*


వివాదానికి కారణమైన పాఠశాల భవనం

**మారని మాజీతీరు..** తాను ఎమ్మెల్యేగా ఉన్నపది సంవత్సరాలలో కలెక్టర్, ఎస్పీలతోపాటు ప్రభుత్వ యంత్రాగాన్ని గుప్పిట్లో పెట్టుకుని ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లు ఏక చక్రాదిపత్యం కొనసాగించిన మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్ధన్ రెడ్డికి పాత అధికారపు వాసనలు పోయినట్లు కనిపించడంలేదు. తాను ఓడిపోవడం ప్రభుత్వం మారిందన్న విషయం గుర్తించిన దాఖలాలు కనిపించడంలేదు. అధికారంలో ఉన్నప్పుడు విపక్షాల వారిని ముఖ్యంగా కాంగ్రెస్ నేతలు కార్యకర్తలను దూషించి ద్వేషించి బహిరంగ సభల్లో పరుష పదజాలంతో బెదిరించి అపఖ్యాతి మూటకట్టుకోవడం జరిగింది. తాను చేసిన మంచి పనుల ఫలితాలకన్నా తన అనుచరులతోపాటు సామాన్యులను సైతం బెదిరింపులకు పాల్పడ్డ దుష్పలితాలే ఈ ఎన్నికల్లో ఓటమికి కారణాలు అన్న విషయాన్ని ఆయన ఇప్పటికికూడా గుర్తించినట్లు లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వివాదాలు సృష్టించుకునే విధంగా దూకుడుగా వ్యవహరిస్తున్నతీరు మరింత చెడుఫలితాలకు దారితీయనున్నాయన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్త మవుతున్నాయి, సిర్సవాడ గ్రామంలో మాజీఎమ్మెల్యే మర్రికి చెందిన

మిగతా 2లో


ప్రారంభోత్సవం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి


కార్యక్రమానికి వస్తున్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

## దేశపురోభివృద్ధి
# కాంగ్రెస్‌తోనే సాధ్యం

- రాష్ట్ర ఎక్సైజ్, మంత్రి జూపల్లి కృష్ణారావు
- అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

**అచ్చంపేట(లింగాల), మేజర్ న్యూస్ :** దేశ పురోభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని, ఇందిరమ్మ రాజ్యం ద్వారానే బడుగు బలహీన వర్గాలకు మేలు చేకూరుతుందని, రాబోయే పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి గెలిపే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు ప్రజాప్రతినిధులు సైనికుల



పనిచేయాలని రాష్ట్ర ఎక్సైజ్ ,పర్యాటక శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అధ్యక్షతన అచ్చంపేటలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన విధంగానే వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పార్టీ అనుబంధ సంఘాల నాయకులు అందరూ కూడా పనిచేసి నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని అన్నారు. రాష్ట్ర ఎన్నికల మేనిఫెస్టోలో కనపర్చిన 6 గ్యారంటీల అమలు దిశగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అడుగులు

మిగతా 2లో

# పాత కాంగ్రెస్ వర్సెస్ కొత్త కాంగ్రెస్

- సీసీ రోడ్ల మంజూరుతో కొత్త చిక్కులు
- గ్రూపులుగా విడిపోయిన కాంగ్రెస్ క్యాడర్
- పెద్దమందడి ఎంపీపీ దగ్గర జగత్‌పల్లి కాంగ్రెస్ నేతల సీసీ రోడ్ల రాజీ



**పెద్దమందడి, మేజర్ న్యూస్ :** నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ఎన్ ఆర్ ఈజీఎస్ పథకంలో భాగంగా గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నియోజకవర్గ వ్యాప్తంగా నిధులు మంజూరు చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఈ పనులు ఎవరు చేయాలన్న సందిగ్ధం కాంగ్రెస్ లో రెండు వర్గాలకు అగ్గి రాజేసింది. ఇటీవల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రంగంలోకి దిగిన మేఘారెడ్డి ని గెలిపించుకున్న కాంగ్రెస్ వర్గం ఒకవైపు, పాత కాంగ్రెస్ నాయకులు మరో వైపుగా సీసీ రోడ్ల పనులు తాము చేస్తామంటే తామే చేస్తామంటూ మండలంలోని అన్ని గ్రామాలలో రెండు వర్గాలకు చెందిన కాంగ్రెస్ క్యాడర్ పట్టుబట్టుకుని కూర్చుంది. దీంతో మండలంలోని ఏ గ్రామంలో కూడా ఇప్పటికీ సీసీ రోడ్ల పనులు ప్రారంభం కాకపోగా ఒక మద్దిగట్ల గ్రామంలో మాత్రం పూర్తి చేసినట్లు ఎంపీపీ రఘు ప్రసాద్ తెలిపారు. మండలానికి మొదటి విడతగా

మిగతా 2లో

# దేశానికి దిక్సుచి నరేంద్ర మోడే

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- కృష్ణలో ఆర్భాటంగా విజయ సంకల్ప యాత్ర ప్రారంభం
- హాజరైన మరో కేంద్రమంత్రి రూపాల



**మహబూబ్‌నగర్ బ్యూరో, మేజర్‌న్యూస్:** భారతదేశానికి దిశ నిర్దేశం చేసి ఈ రోజు అన్ని రంగాల్లో దేశాన్ని ముందుకు నడిపిస్తున్న ప్రజా నాయకుడు నరేంద్రమోడి దేశానికే దిక్సుచిగా మారారు అని కేంద్ర పర్యటక శాఖా మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. భారత దేశ సాంప్రదాయాలు పాటిస్తూ కట్టుబాట్లను అమలు చేస్తూ దేశం గర్వ పడేలా రెండు పర్యాయాలు ప్రధానిగా పనిచేసిన నరేంద్ర మోడిని మరోసారి అధికారంలోకి తీసుకరావాలని ఆయన పిలుపునిచ్చారు. బిజెపి ఎన్నికల శంఖారావం భాగంగా మంగళవారం నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలో కృష్ణ మండలం నుండి బిజెపి విజయ సంకల్ప యాత్ర ప్రారంభం అయింది. ఈ బస్సు యాత్రను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్య క్రమానికి మరో కేంద్ర మంత్రి రూపాల కూడా ప్రత్యేక అహ్వానితులుగా హాజరయ్యారు. కృష్ణ మండల కేంద్రంలోని



మిగతా 2లో

## దేశానికి దిక్సూచి నరేంద్ర మోడే

(మొదటి పేజీ తరువాయి)

కృష్ణానది పరివాహక ప్రాంతంలో కృష్ణమ్మ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి విజయ సంకల్ప యాత్ర ప్రారంభించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్థుత పరిస్థితుల్లో నరేంద్ర మోడి నాయకత్వం దేశ ప్రజలకు ఎంతో అవసరం అన్నారు. కేవలం రాజకీయ దృక్పథం ఉన్న కాంగ్రెస్, బిఆర్‌యస్‌లు దొందు దొందే అని ఆయన వాఖ్యానించారు. ఈ రెండు పార్టీలు ఒక్కటే. ఈ రెండు పార్టీలు కుటుంబ పార్టీలే. ఈ ఇరు పార్టీలు మాటకారి పార్టీలే, ప్రజలను వంచించడంలో ఈ రెండు పార్టీలు పోటా పోటీగా నిలుస్తాయి అని ఆయన ఆరోపించారు. ప్రజల్లో మార్పు తీసుకొచ్చేందుకు కోసం బిజెపి తరపున విజయ సంకల్ప యాత్ర చేపట్టడం జరిగింది. అన్నారు. ప్రధాని నరేంద్రమోడి మంచి తనం వల్ల పేద ప్రజలకు ఉచితంగా అయిదు కిలోల బియ్యం అందుతున్నాయి అన్నారు. అదే విధంగా డబ్బులు అందుతున్నాయి. గ్యాస్ అందుతుంది. పల్లె ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయి ఆయన అన్నారు. మరోసారి ప్రధానిగా మోడిని చూడాలంటే లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను బిజెపిని గెలిపించాలని కిషన్ రెడ్డి కోరారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీ హామీలు గాలికి వదిలేశారు అని విమర్శించారు. పదేళ్ళపాటు అధికారంలో ఉన్న టిఆర్‌యస్ ప్రభుత్వం కూడా ఖాయా పీయా చెల్‌దియా అనే రీతిలో పాలన సాగింది అని కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. కేంద్రమంత్రి రూపాల మాట్లాడుతు దేశవ్యాప్తంగా బిజెపికి ఆదరణ పెరుగుతుంది అన్నారు. ప్రధాని మోడి పాలనలో అన్ని రాష్ట్రాలు అభివృద్ధిలో పయనిస్తున్నాయి అని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను బలపరచాలని కోరారు. ఈ విజయ సంకల్ప యాత్రలో బిజెపి జాతీయ ఉపాధ్యాక్షురాలు డికె అరుణ, కార్యవర్గ సభ్యుడు ఎపి జితేందర్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి బండారి శాంతి కుమార్, విజయ సంకల్ప యాత్ర ఇన్‌ఛార్జ్ శ్రీవర్ధన్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకుడు నాగూరావ్ నామాజీ, రథంగ్ పాండురెడ్డి, కొండయ్య, జలంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేశపురోభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

వేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, డా. చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ, దామోదర రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎమ్మెల్యే మేఘా రెడ్డి,మాజీ యంపి మంద జగన్నాథం , యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి, టిపిసిసి ట్రైనింగ్ కో ఆర్డినేటర్ పవన్ మల్లాది, అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాత కాంగ్రెస్ వర్సెస్ కొత్త కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

రూ.2 కోట్ల 50 లక్షలు నిధులు మంజూరు కాగా , రెండవ విడతలో రూ.85 లక్షలు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద మంజూరయ్యాయి. ఈ నిధులతో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలి. నాయకుల మధ్య సయోధ్య లేకపోవడంతో సీసీరోడ్ల నిర్మాణం ఆలస్యమవుతుంది. తాజాగా జగత్‌పల్లి గ్రామంలో పాత కాంగ్రెస్ కొత్త కాంగ్రెస్ వర్గాలు రెండు కూడా సీసీ రోడ్ల విషయంలో ఒక తాటిపైకి రాకపోవడంతో ఎమ్మెల్యే ఆదేశాలతో మంగళవారం పెద్దమందడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రఘు ప్రసాద్ సమక్షంలో చర్చలు జరిపారు. గ్రామానికి రూ.14.50 లక్షల నిధులు మంజూరు కాగా రెండు వర్గాలకు చెందిన వారు పాత కాంగ్రెస్ కు చెందిన 8 మంది , కొత్త కాంగ్రెస్ కు చెందిన 8 మంది కలిసి రూ.14.50 లక్షల సీసీ రోడ్ల పనులను చేపట్టాలని రాజీ కుదిర్చారు.

## విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి - బిజెపి జిల్లా అధ్యక్షులు పి శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్‌నగర్ అర్బన్ మేజర్‌న్యూస్ :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పాలమూరు పార్లమెంట్ పరిధిలోని కృష్ణ నది వద్ద ప్రారంభమైన విజయ సంకల్పయాత్ర బుధవారం జిల్లా కేంద్రంలోని కేంద్రంలోనికి రానున్నది కావున పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్ర విజయవంతం చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షులు పి శ్రీనివాస్ రెడ్డి పాలమూరు నియోజకవర్గ నాయకులకు కార్యకర్తలకు సూచించారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈరోజు సాయంత్రం 6:30 గంటలకి గడియారం చౌరస్తా వద్ద కార్నర్ మీటింగ్ ఉంటుందని పట్టణంతో పాటు మండలాల నుంచి జన సమీకరణ భారీ ఎత్తున తరలించాలని వారు సూచించారు . సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జి పద్మజా రెడ్డి ,బిజెపి పాలమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కాంటెస్టెంట్ అభ్యర్థి ఏపీ మిథున్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణవర్ధన్ రెడ్డి, జిల్లా కోశాధికారి పాండురంగారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అచ్చుగట్ల అంజయ్య ,పట్టణ అధ్యక్షులు నారాయణ యాదవ్, పట్టణ ఉపాధ్యక్షులు శ్రీశైలం యాదవ్ ,ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్, కౌన్సిలర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎవరి పాత్ర ఎంత?

(మొదటి పేజీ తరువాయి)

ఎంజెఆర్‌ట్రస్టు నిధులతో జడ్పిపాఠశాల భవనాన్ని అధునాతనంగా నిర్మించారు. దీనిపట్ల అందరికి ఓ సదాభిప్రాయం ఉంది కానీ ప్రారంభోత్సవ కార్యక్రమంకూడా ప్రోటోకాల్ ప్రకారం చేసిఉంటే భవననిర్మాతగా సరైన గౌరవం దక్కేది. ప్రజల్లో ఆపాఠశాల నిర్మాణం పట్లఉన్న సదభిప్రాయం మున్ముందు కూడా కొనసాగిఉండేది.ఆయన ఆలాచేయకుండా హుందాతనం కోల్పోయి వ్యవహరించడం చివరికి రెండేండ్లనాటి శంకుస్థాపన శిలాఫలకానికి తెరతీసి ప్రారంభోత్సవంగా ప్రకటించుకోవడం రాజకీయ అపరిపక్వతకే గాక అతనిలోని అహంకారాన్ని ఓటమి వల్ల వచ్చిన అసహనాన్ని వెల్లగక్కినట్లుగానే ప్రజల్లో ఓ చెడు ముద్ర బలపడేలా చేసినట్లుగా భావిస్తున్నారు.



***కదలిక లేని కాంగ్రెస్..*** పాఠశాల భవన ప్రారంభోత్సవ విషయంలో మాజీఎమ్మెల్యే, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు దూకుడుగా వ్యవహరిస్తుండగా తాజా ఎమ్మెల్యేతోపాటు కాంగ్రెస్ కార్యకర్తలు తాపీగా వ్యవహరిస్తున్నారన్నది ఇక్కడ స్పష్టమవుతున్నది. సిర్సవాడ గ్రామంలో ఎంజెఆర్ ట్రస్టు ద్వారా నిర్మించిన పాఠశాల భవనాన్ని టస్టు అదినేత మాజీ ఎమ్మెల్యే మర్రి దంపతులు ఆదివారం ఉదయం 10గం.కు ప్రారంభోత్సవం చేస్తున్నట్లు అంతకు ముందు కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం హోరెత్తించారు బిఆర్ఎస్ కార్యకర్తలు. ఈ కార్యక్రమానికి పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, నేతలు కార్యకర్తలు కూడా తరలి రావాలని పిలుపు నిచ్చారు. అధికారిక కార్యక్రమం అయినందున మాజీ ఎమ్మెల్యే ఎలా ప్రారంభిస్తారన్న సందేహాలు సర్వత్రా వ్యక్త మయినా కాంగ్రెస్‌వైపు నుండి గానీ అధికార వర్గాలనుండి గానీ ఎలాంటి సమాచారం లేకుండా పోయింది. శనివారం రాత్రికి గానీ తాజా ఎమ్మెల్యే వస్తున్నట్లు గ్రూపులలో మెస్సేజ్ పెట్టి వదిలేశారు.కానీ పాఠశాల వద్ద ఏంజరుగుతుంది అన్న విషయాన్ని ఏ ఒక్క కాంగ్రెస్ కార్యకర్తగానీ నాయకులు గానీ అధికారులుగానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఏకంగా శంకుస్థాపన శిలాఫలకాన్ని ప్రభుత్వ పాఠశాల భవనం వద్ద బిఆర్ఎస్ కార్యకర్తలు ఏర్పాటు చేయడం ప్రారంభకార్య క్రమానికి పక్కా ప్లాన్ వేస్తున్నా కాంగ్రెస్ నేతలకు ఖబర్‌లేకపోవడం వారి వైఫల్యానికి నిదర్శనంగా భావిస్తున్నారు.

***అయిపోయినతర్వాత హంగామా..*** ఇదిలా ఉండగా చెప్పిన సమయానికి మాజీ ఎమ్మెల్యే దూకుడుగా అక్కడికి వెల్లి తన కార్యకర్తల చేత జేజేలు కొట్టించుకుంటూ చేయాల్సిన పని చేసేసి వెల్లిన తర్వాత తాపీగా నిర్ణీత వేలకన్నా గంట ఆలస్యంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ఆయన అనుచరులు వెల్లి హంగామా చేయడం హాస్యాస్పదంగా మారింది. ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే వస్తున్న విషయం తెల్సినా ఆయన వచ్చే వరకు కాంగ్రెస్‌కార్యకర్తలు జరుగుతున్న విషయాలను ఎందుకు పరిశీలించలేకపోయారు ఎందుకు నివారించలేకపోయారన్న ప్రశ్న తలెత్తుతుంది. అక్కడ ఏంజరుగుతుంది. బిఆర్ఎస్‌నేతలు ఏంచేస్తున్నారు? అధికారుల వైఖరి ఎలా ఉందిఅన్న విషయాలు ప్రస్తుత ఎమ్మెల్యేకు కాంగ్రెస్‌కార్యకర్తలు ఎవరైనా చెప్పారా? ఎమ్మెల్యే అక్కడ ఏంజరుగుతుంది అన్న విషయం కనీసం తెల్సుకోవడానికి ప్రయత్నించారా? తెలిస్తే ఎందుకు మౌనంగాఉన్నారు? తెలియకపోతే ఆయనకు కమ్యూనికేషన్ గ్యాప్ ఉన్నట్లేనా అన్నప్రశ్నలు సర్వత్రా వెలువడుతున్నాయి. జరగాల్సిందంతా బహిరంగంగా జరిగిపోతున్నా దరిదాపుల్లోలేని కార్యకర్తలు ఎమ్మెల్యే వెంట పోలో మని వచ్చి ఏంప్రయోజనం అన్న ప్రశ్న కూడా ఉదయిస్తున్నది. ఏంజరుగుతుంది ఎవరు ఏంచేస్తున్నారన్న విషయంలో కాంగ్రెస్‌లో లీడర్‌కు క్యాడర్‌కు సమన్వయంలేదన్న విషయం ఇక్కడ స్పష్ట మవుతున్నదన్న భావనకూడా సర్వత్రా వ్యక్త మవుతున్నది. ఈ ఘటన పూర్తిగా కాంగ్రెస్ పార్టీ వైఫల్యంగానే భావిస్తున్నారు.

***గాడిలో పడనిపాలన?..*** కొత్తప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండునెలలు దాటినా నాగర్‌కర్నూల్‌లో పాలనకొత్త ప్రభుత్వానికి అలవాటుపడిన దాఖలాలులేవు. చాలా మంది అధికారులు ఎవరికివారే అన్న తీరులో వ్యవహరిస్తున్నారన్న వాదన వినిపిస్తున్నది. ముఖ్యంగా ఎమ్మెల్యేగా గెలిచి ఇన్నిరోజులు అవుతున్నా కొత్త ఎమ్మెల్యే నియోజకవర్గస్థాయి ఆయా శాఖల అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించిన దాఖలాలు లేవు. అధికారులను సమన్వయం చేస్తున్న దాఖలాలు లేవన్న విషయం సిర్సవాడ సంఘటన స్పష్టంచేస్తున్నది. ప్రారంభోత్సవం గొడవ పక్కన పెడితే ఈ అకాడమిక్ ఇయర్ ముగిసి పాఠశాలలు మూసివేసే సమయందగ్గర పడ్తున్న తరుణంలో జరిగిన ఈవివాదంలో అధికారుల వ్యవహారంకూడాతూతూ మంత్రంగానే ఉన్నట్లుస్పష్టమవుతున్నది. నిర్మాణం ఏట్రస్టు ద్వారా జరిగినా ఆ సంస్థ నిర్మాణం పూర్తి కాగానే అధికారికంగా ప్రభుత్వానికి అప్ప జెప్పాల్సి ఉంటుంది. ఇక్కడ విద్యాశాఖకు చెందిన ఇంజినీరింగ్ డిపార్ట్ మెంటు భవన నిర్మాణాన్నిపూర్తి స్థాయిలో పరిశీలించి వినియోగానికి అనుకూలంగా ఉందని భావించిన తర్వాత సదరు ట్రస్టు నుండి ప్రభుత్వ పరంగా స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుంది. ఆతర్వాతే అధికారిక కార్యక్రమాలు నిర్వహించాలి. ఇక్కడ అలాంటి ప్రోసీజర్ ఏదీ ఫాలో కాలేదనితెల్సింది. గతంలో కొనసాగినట్లుగానే ప్రభుత్వ వ్యవహారాన్ని ప్రైవేట్‌లిమిటెడ్‌కార్యక్రమంగా మార్చివేశారు. ఇక ప్రస్తుతం ఆ పాఠశాలలో ఉన్న ప్రధానోపాధ్యాయుడు ఇంచార్జి మాత్రమేనట. వేర్వేరు పార్టీలకు చెందిన ఇరువురు తాజామాజీ నేతలు ఈకార్యక్రమానికి వస్తున్న సందర్భంగా బాధ్యతలను సదరు ఇంచార్జి మీదే వదిలేసినట్లు కనిపిస్తున్నది. ముఖ్యమైన ఈ కార్యక్రమంలో ప్రధాన పాత్ర పోషించాల్సిన ఎంఇఓ ఎక్కడ అంటున్నారు. కార్యక్రమం ప్రారంభందాకా అక్కడే ఉన్నాడా? లేడా? ఉంటే గొడవ ప్రారంభంకాగానే ఎక్కడికి వెల్లినట్లు కేవలం ఇంచార్జి ప్రధానోపాద్యా యుడు, డిఇఓనేసీన్‌లో కనిపించడం ఏంటన్న ప్రశ్నఉదయిస్తున్నది. ప్రోటోకాల్ ఉల్లంఘిస్తూ మాజీ ఎమ్మెల్యే అక్కడికి రాగానే ఆయనకు స్వాగతం పల్కిన విద్యాశాఖ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మాజీతోపాటు ఆయన సతీమణి ట్రస్టు సభ్యురాలిని సమావేశం కాకుండానే సన్మానాలు చేయడం ఏంటి? ఇదంతా పాత వాసనల ప్రభావంకాదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.అంటే కొత్త ఎమ్మెల్యేను అధికారులు ఇంకా గుర్తించడంలేదా? పాత వాసనలు వదలలేదా? అసలు కొత్త ఎమ్మెల్యే పాలనపై దృష్టిసారించారా? అదే జరిగితే అధికారుల్లో ఈ నిర్లక్ష్య భావం ఎందుకుకల్గుతుంది. ఎమ్మెల్యే కొత్తకావడం వల్ల ఈ వివాదాస్పద అంశాలు తెలియకపోవచ్చు మరి సీనియర్‌నేత అయిన ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి మాటేంటి? ఆయన ఇంకా పోనీలే అన్న తనపాత పద్దతిని మార్చుకోలేక పోతున్నారా? ఇలా ఉంటే భవిష్యత్‌లో వీరి పాలన ఎలా ఉండనుంది. నమ్ముకున్న గ్రామాల్లోని కార్యకర్తల మనోభావాల పరిస్థితి ఏంటి అన్నది నియోజక వర్గంలోని అన్ని వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## సమన్వయంతో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలి - కలెక్టర్







**వనపర్తి ప్రతినిధి, మేజర్ న్యూస్:** అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకొని మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీకి సంబంధించి 2024-25 సంవత్సరానికి గాను బడ్జెట్ ను మునిసిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. మంగళవారం ఆత్మకూరు మునిసిపల్ కార్యాలయంలో బడ్జెట్ సమావేశం జరిగింది. మునిసిపల్ ఛైర్ పర్సన్ గాయత్రి అధ్యక్షతన జరిగిన సమావేశానికి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, మునిసిపల్ కమీషనర్, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీకి సంబంధించి 2024-25 సంవత్సరానికి గాను రూ.8.20 కోట్ల అంచనాబడ్జెట్‌ను మునిసిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు సకాలంలో ప్రాపర్టీ, నల్లా పన్నులను వసూలు చేసి ఆదాయం పెంచడంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. మునిసిపల్‌లో ఉన్న సమస్యలు ఎక్కువగా ఉన్నాయని ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. నిధుల విషయంలో తాను ప్రత్యేక చొరవ తీసుకొని ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

***విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి: జిల్లా కలెక్టర్***

పదో తరగతి విద్యార్థులు త్వరలో జరగబోయే పబ్లిక్ పరీక్షల్లో అత్యున్నత మార్కులు సంపాదించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ సూచించారు. మంగళవారం ఆత్మకూరులోని కేజీబీవీ పాఠశాలను అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగదిని తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం ఆహార పదార్థాల మెనూ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ బోర్డు పరీక్షల్లో అత్యున్నత ఫలితాలు సాధించాలని చెప్పారు. కలెక్టర్ వెంట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు. అంతకుముందు ఆత్మకూరులోని ప్రభుత్వ ఆసుపత్రి, డిగ్రీ కళాశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలం సాంఘిక సంక్షేమ పాఠశాలలో విద్యార్థులకు భోజన వసతి, రికార్డులను పరిశీలించి విద్యార్థులతో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ కలిసి భోజనం చేశారు.

***- హ్యాండ్లూమ్ (చేనేత వస్త్ర తయారీ ) కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్***

అమరచింతలో హ్యాండ్లూమ్ (చేనేత వస్త్ర తయారీ ) కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తో కలిసి సందర్శించారు. అమరచింత చేనేత వస్త్రాల తయారీ గురించి నేతన్నలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ స్వయంగా మగ్గం పై కూర్చుని వస్త్రాలను నేసే తీరు తెలుసుకున్నారు. అదేవిధంగా చేనేత కేంద్రం పక్కన ఉన్న డంపింగ్ యార్డ్ వేరే ప్రదేశానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అంతకు ముందు కలెక్టర్ అమరచింత బస్టాండ్ ప్రహరీ నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## అంతర్జాతీయ స్థాయిలో వాసవి క్లబ్ సేవలు

### - వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జూలూరు రమేష్ బాబు




**కల్వకుర్తి మేజర్‌న్యూస్:** అంతర్జాతీయ స్థాయిలో వాసవి క్లబ్ సేవలు కొనసాగుతున్నాయని వాసవి క్లబ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జూలూరు రమేష్ బాబు అన్నారు. మంగళవారం పాలమూరు లోని వివి ఫంక్షన్ హాల్‌లో వాసవిక్లబ్ ఫస్ట్ క్యాబినెట్ మీటింగ్ సమావేశం జరిగింది, ఈ సమావేశానికి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు పాత సుదర్శన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు, గవర్నర్ జగదీష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రమేష్ బాబు మాట్లాడుతూ పాలమూరు పరిధిలో క్లబ్ల ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నా మన్నారు, రాబోయే రోజుల్లో సమాజంలోని విభిన్న వర్గాలకు వాసవి క్లబ్ల ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలను అందిస్తామన్నారు, మహబూబ్నగర్ పరిధిలోని అన్ని క్లబ్ లలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని జూలూరు రమేష్ బాబు తెలిపారు, కల్వహరి కృష్ణ, ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ కల్మీచర్ల రమేష్, జిల్లా బాధ్యుడు కల్మిచర్లగోపాల్, గుబ్బ ఆంజనేయులు కొట్రా శ్రీనివాస్ భీమిశెట్టి హనుమంత్ జూలూరు సత్యం ఉన్నారు.

## వ్యవసాయ డ్రోన్ వాడకం రైతులకు ప్రయోజనకరం

### - మండల వ్యవసాయ అధికారి నాగార్జున రెడ్డి



**లింగాల, మేజర్‌న్యూస్:** వ్యవసాయానికి వర్తించే మానవరహిత వైమానిక వాహనమైన వ్యవసాయ డ్రోన్ వాడకం రైతులకు ఎంతో ప్రయోజనకరమని మండల వ్యవసాయధికారి నాగర్జున రెడ్డి అన్నారు. మంగళవారం అవుసలికుంట గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో వరి పంటల్లో సస్యరక్షణ చర్యల్లో భాగంగా పురుగుల మందు పిచికారికి నూతన సాంకేతిక పద్ధతిలో డ్రోన్ పరికరం వినియోగం పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ డ్రోన్ టెక్నాలజీతో విత్తనాలు, ఎరువులు వేయడం, పురుగు, తెగుళ్ల, కలుపు మందులు, ద్రవ లేదా నీళ్ళలో కరిగిపోగల ఎరువుల పిచికారీ చెయవచ్చన్నారు. పంట,నేల,వాటర్ షేడ్, కాలువ విడుదలల పర్యవేక్షణ, నీటి వనరుల అభివృద్ధి ప్రణాళిక పర్యవేక్షణ కోసం ఈ డ్రోనులను వాడవచ్చన్నారు.పరీవాహక మరియు ఆదేశ ప్రాంతాల సర్వే, పంట క్షేత్రాల 3-డి మ్యాపింగ్ ఖచ్చిత వ్యవసాయ సాంకేతికతను రైతులకు చేరవేయవచ్చుని అన్నారు. వ్యవసాయ డ్రోన్ తో పిచికారి తక్కువ ఖర్చుతో కూడుకున్నది మరియు 90% నీటిని మరియు 95%సమయాన్ని ఆదా చేయవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జీవో 69 కి పరిపాలన అనుమతులు నిధులు కేటాయించినందుకు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు

### - జల సాధన సమితి నాయకులు



**నారాయణపేట మేజర్ న్యూస్ :** నారాయణ పేట జిల్లా రైతులకు సాగునీరు అందించే జీవో 69 నారాయణ పేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం చేపట్టాలని పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ 2945 కోట్లు నిధులు కేటహించినందుకు ఎమ్మెల్యే శ్రీమతి పర్ణిక రెడ్డి మేడం గారిని జల సాధన సమితి జిల్లా కో కన్వీనర్ హెచ్.నర్సింహా, బికెయస్ జోనల్ కార్యదర్శి వెంకోభ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానం చేసి మిఠాయి తినిపించి పూలమొక్కలు అందించి జిల్లా రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎత్తిపోతల పథకం జీవో 69 ప్రకారం పూర్తి చేసి మొత్తం ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.పేట జిల్లా రైతులకు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు కలియుగ భగీరథుడు గా చరిత్రలో నిలిచిపోతారని వారు తెలిపారు. అనంత్ రెడ్డి,రంగా రెడ్డి,బాల్ రెడ్డి, వెంకట్ రాములు,ఆకుల వెంకటప్ప పాల్గొన్నారు.

## మహబూబ్నగర్ జిల్లా డివిజన్ పోలీస్ ఆఫీసర్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రముఖ సామాజికవేత్త



**కౌకుంట్ల మేజర్‌న్యూస్:** మహబూబ్నగర్ జిల్లా సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు ని మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే మరియు శాలువాతో సన్మానించిన కౌకుంట్ల మండల ప్రముఖ సామాజికవేత్త షేక్ అబ్దుల్ జాంగిర్. ఈ కార్యక్రమంలో గొల్ల శాంతన్న, శేఖర్, హాఫీజ్, కరీం, తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి - జిల్లా అదనపు కలెక్టర్ కె.సీతారామారావు



**నాగర్‌కర్నూల్ ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** పదవ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, అధికారులను ఆదేశించారు. మంగళవారం తన చాంబర్లో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమావేశమై పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ఇంటర్మీడియట్,పదవ తరగతి వార్షిక పరీక్షలలో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయడానికి భరోసా కల్పించాలని అన్నారు. ఈ నెల 28 నుండి మార్చి 19వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. అలాగే, పదవ తరగతి వార్షిక పరీక్షలు మార్చి 18 నుండి ఏప్రిల్ 02 వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగుతాయని వివరించారు. ఇంటర్ పరీక్షలకు మొదటి సంవత్సరం 6,837 విద్యార్థులు, రెండవ సంవత్సరం విద్యార్థులు,7,034,మొత్తం (13,871) మంది విద్యార్థులు హాజరు కానుండగా, 32 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, పదవ తరగతి పరీక్షలకు, బాలురు, 5227 బాలికలు,5332, మొత్తం (10,559) మంది విద్యార్థులకు గాను 60 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. పరీక్షలను సాఫీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు పరీక్షల సమయాలకు అనుగుణంగా రవాణా సదుపాయం అందుబాటులో ఉండేలా బస్సులు నడిపించాలని ఆర్టీసీ అధికారికి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో అడిషనల్ ఎస్పీ రామేశ్వర్, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ, జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం గోవిందరాజులు, ప్రభుత్వ పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్ రావు, జిల్లా రవాణా అధికారి చిన్న బాలు, డిపిఓ కృష్ణ, డిపిఆర్ఓ కిరణ్ కుమార్, నాగర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు, కలెక్టరేట్ ఏ ఓ చంద్రశేఖర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పట్టణం నడిబొడ్డున రూ.2కోట్లతో గిరిజన భవన్ ఏర్పాటు

### - జిల్లా కాంగ్రెస్ ఎస్టీసెల్ అధ్యక్షులు లింగంనాయక్



**మహబూబ్‌నగర్ అర్బన్ మేజర్‌న్యూస్:** పట్టణం నడిబొడ్డున కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రూ. 2కోట్లతో గిరిజన భవన్ ను ఏర్పాటు చేసుకుంటామని జిల్లా కాంగ్రెస్ ఎస్టీసెల్ అధ్యక్షులు లింగంనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవలే జరిగిన సేవాలాల్ జయంతి వేడుకల్లో గిరిజన భవన కోసం రూ. కోటి, సేవాలాల్ దేవాలయానికి రూ. 40 లక్షలు ఇచ్చామని మాజీ మంత్రి చెప్పుకోవడం. సరికాదన్నారు. అక్కడ గిరిజన భవన్ లేదని కేవలం షెడ్డులా ఉందన్నారు. కేవలం 15 లక్షల కేటాయించారని అన్నారు. రెండుసార్లు గిరిజనులు ఓట్లు వేసి ఆయనను గెలిపిస్తే గిరిజనులకు చేసిందేమిలేదన్నారు. పట్టణంలో కనీసం 70 మంది గిరిజనులకు కూడా డబుల్ బెడ్రూంలు ఇవ్వలేదన్నారు. ఏనుగొండ రైల్వే పట్టాల అవతల 1975లో గిరిజనుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 5 ఎకరాలు కేటాయిస్తే ఇస్తే మీ ప్రభుత్వం లాక్కొందని ఆరోపించారు. అక్కడ 670 డబుల్ బెడ రూమ్ లు కట్టి కేవలం 12 మంది గిరిజనులకు కేటాయించడం సరికాదన్నారు. గిరిజనులను మభ్యపెట్టడం మాజీ మంత్రి మానుకోవాలని హితవుపలికారు. సమావేశంలో నాయకులు కిషన్ నాయక్, తులసిరాంనాయక్, రవికుమార్, రాంచందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ తిక్క వీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు పోస్టర్ విడుదల



**అయిజ మేజర్ న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా ఐజ పట్టణ పరిధిలోని శ్రీశ్రీశ్రీ తిక్క వీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ను మంగళవారం రోజున గ్రామ పెద్దలు , మున్సిపల్ అధికారులు వివిధ పార్టీల నాయకులు విడుదల చేశారు. ఈ బ్రహ్మోత్సవాలు ఈనెల 27వ తారీకు నుండి వచ్చే నెల 11 వ తారీకు వరకు అట్టహాసంగా జరుగుతాయని గ్రామ పెద్దలు అధికారులు జాతరకు సంబంధించిన బుక్లెట్ వాల్ పోస్టర్స్ ను ఆవిష్కరించడం జరిగింది. అనంతరం మాజీ గ్రంథాలయ చైర్మన్ పటేల్ విష్ణువర్ధన్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ చిన్నదేవన్న మాట్లాడుతూ గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం ఇంకా అద్భుతంగా విద్యుద్దీకరణతో పట్టణ పురవీధుల గుండా ఎటువంటి చెత్తాచెదారం లేకుండా పూర్తిగా ఐజను ఒక అంతపురం లాగా చేసి శ్రీశ్రీశ్రీ తిక్క వీరేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగులాగున చర్యలు తీసుకుంటున్నామని ప్రజలందరూ సహకరించి బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ పెద్దలు మాట్లాడుతూ యువత బ్రహ్మోత్సవాల సమయంలో చాలా జాగ్రత్తలు పాటించాలని బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలిగించరాదని పోలీసు వారికి సహకరించాలని గ్రామ పెద్దలు యువతకు ప్రజలకు తెలిపారు. బ్రహ్మోత్సవాలనేవి మన ఆటలకు పాటలకు మాత్రమే కాక భక్తిశ్రద్ధలతో పూజలు జరుపుకోవాలని తెలిపారు ఈ వాల్ పోస్టర్ విడుదల కార్యక్రమంలో గ్రామ పెద్దలతో పాటు వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు భక్తులు గ్రామ ప్రజలు ఉన్నారు.

## గద్వాల్ జమ్మిచేడులో సంపూర్ణ సురక్ష హెచ్ఐవి/ఎయిడ్స్ క్యాంప్



**గద్వాల మేజర్ న్యూస్:** జిల్లా కేంద్రంలో జమ్మిచేడు లో తెలంగాణ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి ఆదేశానుసారం హెచ్ఐవి మరియు ఎయిడ్స్ పై అవగాహన/హెల్త్ క్యాంప్ పెట్టడం జరిగినది. ఈ కార్యమానికి ముఖ్య అతిథిగా డి వై డి ఎం %ఒ%హెచ్ ఓ డాక్టర్ సిద్దప్ప మధుసూదన్ రెడ్డి, కృష సాగర్ మరియు ఐసీటీసీ కౌన్సిలర్ ఫరిధ్ రావడం జరిగింది . డాక్టర్ సిద్దప్ప మాట్లాడుతూ ఈ వ్యాధి అంటువ్యాధి కాదు అంటించుకునే వ్యాధి మరియు ఇది నాలుగు రకాలుగా వస్తుంది ఆశ్రుషిత లైంగిక సంబంధముల ద్వారా రక్త మార్పిడి ద్వారా, తల్లి నుండి బిడ్డకు, సూదులు సిరంజీల ద్వారా వస్తుంది. యువత తప్పుదారి పట్టకుండా మంచి దారిలో నడవాలని మాదక ద్రవ్యాలు అలవాటు కాకుండా ఉండాలని తెలియజేయడం జరిగినది ప్రతి గర్భిణీ స్త్రీలు హెచ్ఐవి టెస్ట్ చేసుకోవాలి, ఎవరికి అయినా అనుమానం ఉంటే దగ్గర్లో ఉన్న గవర్నమెంట్ హాస్పిటల్ మరియు ఐసిటిసి సెంటర్ ని సందర్శించండి వారి వివరాలు గోప్యంగా ఉంచబడును సందేహాలు సలహాల కోసం 1097 టోల్ ఫ్రీ నంబర్ కి కాల్ చేసి మీ యొక్క సందేహాలను నివృతం చేసుకోగలరు. క్యాంప్ లో 65 హెచ్ఐవి టెస్టులు చేయటం జరిగింది ఈ కార్యక్రమం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో ఈ హెల్త్ క్యాంప్ పెట్టడం జరిగినది. ఈ కార్యక్రమంలో హెరీవ్ ఎన్జిఓ ప్రోగ్రాం మేనేజర్ ఉదయ్ శేఖర్ మరియు గద్వాల్ జిల్లా ఇంఛార్జి లక్ష్మి నారాయణ సుధాకర్ పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో పాదపూజ కార్యక్రమం




**నాగర్ కర్నూల్ ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** నాగర్ కర్నూల్, స్థానిక ఈశ్వర్ కాలనీలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం లో భాగంగా ఈనెల విద్యార్థుల తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏ జి మ్ భాస్కర్ రెడ్డి, కోఆర్డినేటర్ మధుసూదన్ ,డీన్ శివకుమార్, ప్రిన్సిపల్ రాజీవ్ ప్రియదర్శన్ మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి యొక్క విశిష్టత, కుటుంబ ప్రేమాభిమానాలు, గౌరవం, వారితో ఎలా కలిసి ఉండాలో వివరించారు. ఆ తర్వాత తల్లిదండ్రులకు విద్యార్థిని విద్యార్థులచే పాదపూజ కార్యక్రమం నిర్వహించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులకు పిల్లల పట్ల ప్రేమాభిమానాలు, విద్యార్థినీ విద్యార్థులకు తల్లిదండ్రుల పట్ల గౌరవ ప్రేమాభిమానాలు స్పష్టంగా కనిపించాయి. ఈ కార్యక్రమంలో 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందరూ పాల్గొనడం వల్ల వారి ప్రేమాభిమానాలతో ఈ కార్యక్రమం ఎంతో విజయవంతంగా నిర్వహించారు.

సూర్య
www.suryaa.com

బుధవారం
21 ఫిబ్రవరి 2024

## మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని: ఎమ్మెల్యే కు వినతి పత్రం



**రేవల్లి మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని స్థానిక మండల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు మంగళవారం రోజు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది .మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వాడాల పర్వతాలు మాట్లాడుతూ మండలంలోని 12 గ్రామాల నుంచి ప్రభుత్వ పాఠశాలలో సంవత్సరానికి దాదాపు 150 నుంచి 200 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాస్తున్నారని, ఇందులో చాలామంది విద్యార్థులు ఇంటర్ విద్యను అభ్యసించడానికి వనపర్తి, కోడేరు, నాగర్ కర్నూల్ లాంటి పట్టణాలకు వెళ్లి, వేలలో రూపాయలు కాలేజ్ ఫీజులు, బస్ పాసులు కడుతూ దూర ప్రాంతాలకు వెళ్ల లేక విద్యార్థులు చదువులకు దూరమై తమ బంగారు భవిష్యత్తు కోల్పోతున్నారని, పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కొరకు మండలంలో కూడా ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. దానికి ఎమ్మెల్యే తూడి మెఘా రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో బాల్ రెడ్డి, యండి. సుల్తాన్, సుధాకర్, సురేష్ యాదవ్, రాములు, రఘు, మల్లేష్ తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మాంటిస్సోరి పాఠశాలలో సరస్వతీ పూజ



**అల్లంపూర్ మేజర్‌న్యూస్:** స్థానిక అలంపూర్ మాంటిస్సోరి పాఠశాలలో సోమవారం సాయంత్రం ఎంతో భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాన్ని అలంపూరు దేవాలయ ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ ఆధ్వర్యంలో పూజను చక్కని మంత్రోచ్ఛారణతో పూజను జరిపారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 23వ తేదీన సిబిఎస్ఈ పరీక్షలు వ్రాసే విద్యార్థులకు ఆ సరస్వతీ దేవి కటాక్షము సదా ఉండాలని ఎంతో భక్తిశ్రద్ధలతో విద్యార్థులు పూజ కార్యక్రమాన్ని జరుపుకున్నారు. ఈ వేడుకలో భాగంగా పాఠశాల డైరెక్టర్ కె యన్ వి రవి ప్రకాశ్ సరస్వతీ దేవి, జోగులాంబ అమ్మవారి ఆశీస్సులతో పదవ తరగతి పరీక్షలు సజావుగా సాగుతూ మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తెలుగు ధారాళంగా చదివేలా ఉపాధ్యాయుల కృషి చేయాలి



**పానగల్, మేజర్‌న్యూస్:** విద్యార్థులు తెలుగును ధారాళంగా చదివేలా పాఠశాల ఉపాధ్యాయుల కృషి చేయాలని మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ సూచించారు. మండల పరిధిలోని జమ్మాపూర్ ప్రభుత్వ ప్రాథమికొన్నత పాఠశాలను ఆయన సాధారణ తనిఖీలలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా రెండోవ తరగతి విద్యార్థుల తెలుగు, గణిత సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల ఉపాధ్యాయులకు పలు సూచనలను చేశారు, అనంతరం పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం వాడే బియ్యన్ని అయన పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరశేఖరచారి ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## బాధితుడికి ఎల్‌వోసి అందజేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి



**వనపర్తి ప్రతినిధి, మేజర్ న్యూస్:** వనపర్తి మండలం అచ్చుతాపురం గ్రామానికి చెందిన బోయ బక్క తిరుపతయ్య గుండె సంబంధిత సమస్యతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యులు ఆయనకు శస్త్ర చికిత్స చేసి ఒక స్టంటును అమర్చారు. మరో రెండు స్టంట్ లు అమర్చేందుకు ఆర్థిక ఇబ్బందులు ఉండడం వల్ల గ్రామ నాయకులు పాపిరెడ్డి ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వారికి ప్రభుత్వం తరపున "రెండు లక్షల" రూపాయల విలువ గల ఎల్‌వోసి మంజూరు చేయించి, బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అత్యంత ఖరీదైన శస్త్ర చికిత్సల్లో ఒకటైన గుండె శస్త్ర చికిత్స కు సహాయం అందించి తమ కుటుంబానికి భరోసాగా నిలిచిన ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎన్టీఆర్ కళాశాలలో ఘనంగా పోతన జయంతి



**మహబూబ్ నగర్ అర్బన్ మేజర్ న్యూస్ :** మంగళవారం ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆద్వర్యంలో పోతన జయంతిని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ డాక్టర్ యం. విజయ్ కుమార్ మాట్లాడుతూ, పోతన నీతి ధర్మం వైపు నిలబడేలా తన సాహిత్యం రాశారన్నారు. సామాజిక చైతన్యం తీసుకురావడంలో పోతన కవిత్వం పాత్ర ఎంతో గొప్పదన్నారు. రాజ్య విలాసాలను ఆశించినటువంటి కవి పోతన. భక్తి తత్వాన్ని తను రాసినటువంటి మహాభాగవతము ద్వార తన్మయత్వం పొందేలా చేశారన్నారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ ,పోతన కవితరీతులను తెలియజేశారు. పోతన రాసిన పద్యాలను అలవోకగా పాడి వినిపించారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు సునీత, హేమలత, వెంకటయ్య గౌడ్, పొన్నగంటి ప్రభాకర్, బోల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలకు లైబ్రరీ పుస్తకాలు అందజేత



**గోపాలపేట మేజర్ న్యూస్ :** గోపాలపేట మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం దగ్గర ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలకు ఎం ఈ ఓ శ్రీనివాస్ గౌడ్ లైబ్రరీ పుస్తకాలను అందజేశారు ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఆటలతోపాటు లైబ్రరీ పీరియడ్ చాలా ముఖ్యమైనదని దీనికి వారంలో ఒకరోజు ప్రత్యేక పీరియడ్ కేటాయించి విద్యార్థులకు లైబ్రరీ పుస్తకాల ద్వారా పఠనాశక్తిని పెంపొందిం చడమే కాకుండా తప్పులు లేకుండా చదవడంతో పాటు ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు మానసికమైన జ్ఞానోదయ వికాసం కలుగుతుందన్నారు ప్రభుత్వం ఎంతో ఖర్చు పెట్టి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం పాటుపడుతుందని వాటి ప్రయోజనాలు ఉపాధ్యాయులు గుర్తించి ప్రతి విద్యార్థికి ప్రయోజనం చేకూరేటట్లు పాటుపడాలని ఆయన ఆకాంక్షించారు ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలకు 261 రకాల పుస్తకాలు, ఉన్నత పాఠశాలలకు 120 రకాల లైబ్రరీ పుస్తకాలు రాష్ట్ర కార్యాలయం నుండి జిల్లా విద్యాశాఖ ద్వారా ఏర్పాటు చేసిందని ఇందులో విద్యార్థులకు ఆకర్షణీయంగా బొమ్మల రూపంలో వివిధ చార్టుల రూపంలో ఆలోచింపచేసే కథలో ఉన్నాయని పాఠశాల గోడలకు తగిలించుకోవడానికి కొన్ని రకాల క్యాలెండర్ రూపంలో ఉన్నాయని తెలిపారు ఈ కార్యక్రమంలో సిఆర్పిలు ఎంఆర్సి సిబ్బంది చంద్రశేఖర్ రమేష్ నిర్మల అమృత శ్రీనాథ్ లావణ్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుచ్చిరెడ్డి శ్రీనివాసరావు రామ్మూర్తి రాంబాబు రాజేశ్వరి తదితరులున్నారు.

## ధరూర్ మండల నూతన తహసీల్దార్‌గా కే వెంకట్రావు



**ధరూర్ మేజర్ న్యూస్:** మండలంనకు నూతన తహసిల్దారుగా కే వెంకట్రావు భాద్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తాసిల్దార్ వెంకట్రావు మాట్లాడుతూ మండలముగా మంచి పేరుంది మండలంకు సేవ చేయడానికి అవకాశం వచ్చినందుకు గర్వంగా భావిస్తున్నారని మండల ప్రజలందరూ అన్ని విధాలుగా సహకరించి ధరూర్ మండలమును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు తోడు రావాలని ప్రజలకు తెలియజేశారు. తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది నూతన తాసిల్దార్‌కు స్వాగతం పలుకుతూ అభినందనలు తెలియజేశారు.

## ఈ నెల 22న కబడ్డీ సీనియర్ పురుషుల జట్టు ఎంపిక

**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** కబడ్డీ అసోసియేషన్ నాగర్ కర్నూల్ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 22న కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం లో జిల్లా సీనియర్ పురుషుల కబడ్డీ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి, ప్రధానకార్యదర్శి ఎ. యాదయ్య గౌడ్ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు వచ్చే క్రీడాకారులు 85 కేజీల లోపు బరువు కలిగి ఉండాలన్నారు, ఆధార్ కార్డు తో మోహన్ లాల్, రాఘవేందర్ లను సంప్రదించాలని వారు క్రీడా కారులకు వారు సూచించారు, జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు మార్చ్ 2 నుండి 4 వరకు నల్గొండ జిల్లా లోని నాగార్జున సాగర్‌లో జరుగనున్న 70వ తెలంగాణ రాష్ట్రస్థాయి కబడ్డీ ఛాంపియన్ షిప్ లో పాల్గొంటారని జనార్ధన్ రెడ్డి, యాదయ్య గౌడ్ లు పేర్కొన్నారు, వివరాలకు 9912524385. 9866722480 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## విద్యార్థులు అస్వస్థత.. పరామర్శించిన జెడ్పీ చైర్ పర్సన్



**గద్వాల మేజర్ న్యూస్:** గద్వాల మండలం,రేకులపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనం తిన్న 14 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి విద్యార్థులకు వైద్యం అందించారు. రేకులపల్లి గ్రామానికి చెందిన ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థులు వాంతులు చేసుకోవడంతో గమనించిన ఉపాధ్యాయుడు గద్వాల ప్రభుత్వం ఆసుపత్రికీ తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్న విద్యార్థులు నీటి సంబదిత కారణాలు, కడుపు నొప్పి సమస్య వల్లే ఇలాంటి సంఘటన చోటు చేసుకున్నట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సరితా విద్యార్థుల దగరికి వెళ్లి చిన్నారులను పరమర్శించారు. త్వరలో మీ పాఠశాలను సందర్శన చేస్తానని అక్కడి సమస్యలు ఏంటో తెలుసుకుంటానని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## నేడు గుండాల టెంకాయల వేలం..

**వెల్దండ :** మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని గుండాల అంబా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలలో టెంకాయలు అమ్ముకొనకు అమ్ముకొనుటకు 21వ తేదీన వేలం పాట నిర్వహించినట్లు ఆలయ ఈవో ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1:30 గంటలకు టెంకాయల విక్రయం తోపాటు , లడ్డు పులిహోర ప్రసాదం , చిప్పలు పోగు చేసుకొనుటకు మార్చి నెల 5వ తేదీ నుండి , పిల్లల నాలుగో తేదీ వరకు ఒప్పందం చేసుకొనుటకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఈవో పేర్కొన్నారు. కలిగిన వ్యాపారులు హరజు పాడేందుకు ముందు టెంకాయల వేలం , లడ్డు పులిహోర ప్రసాదం కొరకు రూ. 20 వేలు , కొబ్బరి చిప్పలు పోగు చేసుకొనుటకు రూ 10 వేలు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు. వేలం పాట అనంతరం వేలం పాటలో భాగస్వాములైన వారి డిపాజిట్లు తిరిగి చెల్లించనున్నట్లు ఈవో పేర్కొన్నారు. వేలంపాట దక్కించుకున్న వారు వెంటనే 75 శాతం డబ్బు చెల్లించి ఆలయ యువ ద్వారా రసీదు తీసుకోవాలని , మిగతా డబ్బు పది రోజుల్లోగా చెల్లించాలని తెలిపారు. వేలంపాట అనంతరం 75% డబ్బు చెల్లించనీ చో తిరిగి మళ్లీ వేలంపాట నిర్వహించనున్నట్లు ఈ ఓ తెలిపారు.

## గౌడ కులస్తులక 5 లక్షల వడ్డీలేని రుణాలు ఇవ్వాలి



**వెల్దండ :** రియల్ వ్యాపారం కారణంగా ఈత. తాటీ వనాలు అంతరించి ఉపాధి కోల్పోతున్న గౌడ కులస్తుల కు ప్రభుత్వం రూ .5 లక్షల వడ్డీలేని రుణాలు ఇచ్చి ప్రోత్సాహం అందించాలని గౌడ సంక్షేమ సంఘం తాలుక ఉపాధ్యక్షుడు తిరుమన్ దాసు నాగరాజు గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొట్ర గ్రామంలో . మండలానికి సంబంధించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్ ను గ్రామ గౌడ కులస్తులతో కలిసి నాగరాజు గౌడ్ అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కల్లు గీత కార్మికులకు రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి గీతా కార్మికునీకి ద్విచక్ర వాహనం ఇవ్వాలన్నారు. తమ హక్కుల సాధన కోసం గౌడ కులస్తులంతా సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడు ఉడుతాల అల్లజీ గౌడ్. మండలనాయకులు అయిల నాగేష్ గౌడ్. చిల్వెరు వెంకటయ్య గౌడ్, తిరుమన్ దాసు.అశోక్ గౌడ్. గట్టు వెంకటయ్య గౌడ్. నాగయ్య గౌడ్ . దశరథం గౌడ్ .హరీష్ గౌడ్. కుర్మయ్య గౌడ్, చందు గౌడ్, రాయల్ గౌడ్. శేఖర్ గౌడ్. బాలస్వామి గౌడ్. రాములుగౌడ్. మహిళా కమిటీ అధ్యక్షురాలు చిట్టి లక్ష్మమ్మ తదితరులు ఉన్నారు.

## తిరుమలదేవస్థానంలో పుట్టపల్లి భజన బృందం



**కౌకుంట్ల మేజర్ న్యూస్:** కలియుగ దైవమైన తిరుమల తిరుపతి దేవస్థానం లో మంగళవారం 6 గంటలకు పుట్టపల్లి శివ ఆంజనేయ స్వామి భజన బృందం హరినామ సంకీర్తన కార్యక్రమంలో పాల్గొని, ఆ వెంకటేశ్వర స్వామిని ప్రార్థిస్తూ స్వామివారి కరుణ కటాక్షంలు మాపై ఎల్లవేళలా ఉండాలని ఆ స్వామి వారిని స్మరిస్తూ భజన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా పుట్టపల్లి భజన బృందం సభ్యులు ఓం నమో వెంకటేశాయ ,ఓం నమో వెంకటేశాయ ,అంటూ ఆ వెంకటేశ్వరుని స్మరిస్తూ, స్వామివారికి పూజలు నిర్వహించారు.

## మండల యువజన కాంగ్రెస్ కమిటీ ఎన్నిక



**కౌకుంట్ల మేజర్ న్యూస్** :దేవరకద్ర శాసన సభ్యులు జి మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు కౌకుంట్ల మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యు.నరేష్ ఆధ్వర్యంలో కౌకుంట్ల మండల యువజన కాంగ్రెస్ కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కౌకుంట్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇస్రంపల్లి రాఘవేందర్ రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా కౌకుంట్ల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా యు నరేష్ కుమార్, ఉపాధ్యక్షులుగా రవీందర్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, జనరల్ సెక్రెటరీలుగా చంద్ర ప్రతాప్ రెడ్డి, రాకేష్ యాదవ్, మాధవరెడ్డి, నాగిరెడ్డి, ప్రవీణ్, మరియు సెక్రటరీగా నితిన్, (పుట్టపల్లి), సోషల్ మీడియా గా హాజీ, (అప్పంపల్లి) లను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకుడు మృతి - సంతాపం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే



**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** గద్వాల జిల్లా కేంద్రంలోని 26 వ వార్డుకు చెందిన కౌన్సిలర్ కోరి లక్ష్మి భర్త బిఆర్ఎస్ పార్టీ నాయకులు కోరి నర్సింహులు మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. గద్వాలఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వారి ఇంటికి చేరుకుని సంతాపం తెలిపారు. కోరి నర్సింహులు ఆకస్మిక మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ మంచి నాయకుడిని కోల్పోవడం దురదృష్టకరమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## వ్యక్తి ఆత్మహత్య



**తిమ్మాజిపేట, మేజర్ న్యూస్ :** తిమ్మాజిపేట మండల పరిధిలోని పోతు రెడ్డి పల్లి లో సాగుల శ్రీరాములు 46 అనే వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత ఆరు నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతూ ఉన్నాడని అదేవిధంగా సోమవారం రాత్రి భరించలేని కడుపునొప్పి రావడంతో ఇంటి ఆవరణలోని మామిడి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని మంగళవారం కుమారుడు మణికంఠ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నామని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి తరలించినట్లు ఏఎస్ఐ ప్రిసిల్ల తెలిపారు.

## అయోధ్యకు బయలుదేరిన యువకులు



**వడ్డేపల్లి మేజర్ న్యూస్:** అయోధ్య భవ్య రామ మందిరంలోని బలరాముని దర్శించుకోవడానికి వడ్డేపల్లి మున్సిపాలిటీలోని పైపాడు నుంచి 16 మంది యువకులు అయోధ్యకు మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షులు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అయోధ్యకు బయలుదేరినట్లు ఆయన తెలిపారు .ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి మండల అధ్యక్షులు నరసింహులు మాట్లాడుతూ హిందువుల 500 ఏళ్ల అయోధ్య బల రాముని విగ్రహ ప్రతిష్టపానతో నెరవేరిందని. శ్రీ రాముని దర్శనానికి ఇప్పటివరకు 13 ప్రత్యేక రైలు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షులు పైపాడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ. నాగర్ కర్నూల్ పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి రామభక్తులు అయోధ్యకు వెళుతున్నట్లు ఆయన తెలిపారు.

## జమ్మిచేడు బ్రహ్మోత్సవములలో పాల్గొన్న : జడ్పీ చైర్ పర్సన్ సరితా తిరుపతయ్య



**గద్వాల మేజర్ న్యూస్:** శ్రీశ్రీశ్రీ జమ్ములమ్మ మరియు పరశురామ స్వామి దేవస్థానం (జమ్మిచేడు) బ్రహ్మోత్సవములలో పాల్గొన్న జడ్పీ చైర్ పర్సన్ సరితా తిరుపతయ్యని టెంపుల్ ఈఓ పురేందర్, టెంపుల్ చైర్మన్ గాయత్రి సతీష్, శారద సురేష్, రాముడు, నాగరాజు, ఆనంద్, నాగేందర్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, కొండపల్లి తిరుమలలేష్, పేదోడి రామకృష్ణ, మదిలేటీ, డీటీటీసీ నర్సింహులు, తుమ్మల నర్సింహులు, ఈశ్వర్, శేకర్అయ్య, తదితరులు పాల్గొన్నారు.

## 24న బీజేపీ జోగులాంబ క్లస్టర్ విజయసంకల్ప రథయాత్ర - బిజెపి జిల్లా అధ్యక్షులు డి. నారాయణ



**వనపర్తి టౌన్, మేజర్ న్యూస్ :** ఈనెల 24 న బీజేపీ జోగులాంబ క్లస్టర్ విజయసంకల్ప రథయాత్ర తిరుమలయ్య పల్లి, ఖిల్లా ఘనపూర్ గుండా వనపర్తి కి చేరుతుందని బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ పేర్కొన్నారు. మంగళవారం బిజెపి జిల్లా కార్యాలయంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన బిజెపి జోగులాంబ క్లస్టర్ విజయసంకల్ప రథయాత్ర నిర్వహణ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, కేంద్ర మత్స్య, పాడి పరిశ్రమ శాఖ మంత్రి పురుషోత్తం రూపాల చేతులమీదుగా కృష్ణ గ్రామంలో ప్రారంభమైన జోగులాంబ (మహబూబ్నగర్,నాగర్ కర్నూల్, నల్లగొండ పార్లమెంట్) క్లస్టర్ విజయసంకల్ప రథయాత్ర ఖిల్లా ఘనపూర్, పెద్దమందడి మండలాల మీదుగా వనపర్తి పట్టణంలోకి ప్రవేశించనున్నదని, పట్టణంలో పలు వీధుల గుండా రోడ్ షో ద్వారా రాజీవ్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, కార్నర్ మీటింగులో ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రులు పాల్గొని గత పదేళ్లలో మోదీ ప్రభుత్వపు విజయాలను ప్రజలకు వివరించనున్నారని రాత్రికి లక్ష్మీ కృష్ణ గార్డెన్స్ లో భోజన వసతి, రాత్రి బస ఉండనుందని, 25వ తేదీ ఉదయం మేధావులతో టిఫిన్ మీటింగ్ తర్వాత ప్రెస్ మీట్ అనంతరం యాత్ర వనపర్తి రూరల్ మండలం గుండా పెబ్బేరు మండలంలోకి ప్రవేశించనుందని ఆయన పేర్కొన్నారు. జోగులాంబ క్లస్టర్ విజయసంకల్ప రథయాత్ర విజయవంతానికి 12 కమిటీలను నియమించడం జరిగిందని ప్రచార కమిటీకి ఏ. సీతారాములు,కదిరే మధు, పబ్లిక్ మీటింగ్స్ కి ప్రవీణ్, అరవింద్, జన సమీకరణ శ్రీనివాస్ గౌడ్,బచ్చు రాము, స్థానిక సమస్యలు ఆర్. వెంకటేశ్వర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, చేరికలు సబిరెడ్డి వెంకటరెడ్డి, మణి వర్ధన్ సాగర్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పెద్దిరాజు, విజయసాగర్, యాత్ర కాన్వాయ్ సూగూరు రాము,విక్రం, వసతి భోజన సౌకర్యం బోయెల్ల రాము, మహేందర్ లీగల్ పర్మీషన్ తిరుమలేష్,ఎద్దుల రాజు బైక్ ర్యాలీ రాజశేఖర్ గౌడ్ మెటీరియల్ బండారు కుమారస్వామి, మహిళా ఇన్చార్జిలుగా సుమిత్ర, కల్పన, జ్యోతి లను నియమించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి%ౖ% యాత్ర ఇన్చార్జి బి.శ్రీశైలం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మున్నూరు రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు ఏ. సీతారాములు,ఆర్.వెంకటేశ్వర్ రెడ్డి,చిత్తారి ప్రభాకర్, కోశాధికారి బాశెట్టి శీను,పార్లమెంట్ కో కన్వీనర్ దాసరాజు ప్రవీణ్,అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి%ౖ% మీడియా ఇన్చార్జి పెద్దిరాజు,జిల్లా అధికార ప్రతినిధి మనివర్ధన్ సాగర్, జిల్లా కార్యదర్శి బోయెల్ల రాము, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జ్ఞానేశ్వర్ యాదవ్, పట్టణ ఉపాధ్యక్షులు విక్రమ్, యువ మోర్చా నాయకులు మహేందర్, ఎద్దుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలి : ఎమ్మెల్యే యన్నం శ్రీనివాసరెడ్డి




**పాలమూరు మేజర్ న్యూస్ :** రానున్న ఎంపీ మరియు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని స్థానిక ఎమ్మెల్యే యన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక డిసిసి కార్యాలయంలో పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పది ఏళ్ల నుండి మహబూబ్నగర్ మున్సిపాల్టీ లో కౌన్సిలర్లకు ఎలాంటి అధికారాలు ఇవ్వకుండా గత మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆధిపత్యం చెలాయించారన్నారు. ప్రజలకు తీవ్ర నష్టం చేసి , దుర్మార్గంగా వ్యవహరించిన బీఆర్ఎస్ ను ధ్వంసం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కంకణం కట్టుకుందన్నారు. మహబూబ్నగర్ పట్టణ అభివృద్ధి కోసమే కౌన్సిలర్లు తమ పార్టీకి చైర్మన్, వైస్ చైర్మన్ అవకాశం కల్పించి పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ హైకమాండ్ సూచన మేరకే రాష్ట్రమంతా కాంగ్రెస్ పార్టీలో చేరికలు కొనసాగుతున్నా యన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో పని చేసిన వారందరికీ తిరిగి పార్టీలో చేరేందుకు ఆహ్వానం పలుకుతున్నామన్నారు. ప్రతిపక్ష పార్టీలో ఉన్న అధికారంలో ఉన్న విమర్శలు చేయడం సహజమని గతాన్ని మర్చిపోయి పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పని చేయాలని నాయకుల కు సూచించారు. పార్టీకి నష్టం చేస్తే సహించేది లేదని, పార్టీ కోసం పనిచేసే వారిని కడుపులో పెట్టి చూసుకుంటామన్నారు. రానున్న ఎన్నికల్లో కలిసికట్టుగా చర్చించుకుని ముందుకు వెళ్తామని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులకు, కౌన్సిలర్లకు కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేందర్ రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, సిరాజ్ కాద్రి లక్ష్మణ యాదవ్ చంద్రకుమార్ ,మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ లు ఆనంద్ గౌడ్ షబీర్ అహ్మద్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు రాములు యాదవ్, మహిళా నాయకురాలు బెక్కరి అనిత, మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనర్ పాల్గొన్నారు.

# మోదీని మూడోసారి ప్రధానిగా చేద్దాం...

### - విజయ సంకల్ప యాత్ర ప్రారంభించిన కేంద్ర మంత్రులు పరుషోత్తమ్ రూపాల, కిషన్ రెడ్డి..



**మక్తల్ మేజర్ న్యూస్:** ప్రపంచ దేశాల్లోనే భారత దేశాన్ని ముందంజలో తీసుకెళ్తున్న నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానిగా చేద్దామని కేంద్ర మత్స్య శాఖ మంత్రి పరుషోత్తమ్ రూపాల, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. విజయ సంకల్ప యాత్ర ను క్రిష్ణ మండల కేంద్రము నుంచి ప్రారంభించారు. అనంతరం మఖ్తల్ పట్టణంలో జరిగిన కార్నర్ మీటింగ్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో దేశంలో జాతీయ రహదారులు, రైల్వే లైన్లు, ఎయిర్ పోర్ట్ లు నూతనంగా నిర్మాణం అయ్యాయని అన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు ఉపాధి హామీ పథకం కింద నిధులను ప్రధాని మోదీ మంజూరు చేస్తున్నారని తెలిపారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ను తీర్చిదిద్దారని అన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని, జార?ండ్ లో ఓ ఎంపీ ఇంట్లో 400 కోట్ల నగదు బయటపడిందని, లెక్కించడానికి కౌంటింగ్ మెషీన్లు సైతం సరిపోలేదని అన్నారు. నరేంద్ర మోదీ కృషితోనే అయోధ్యలో బలరాముని ప్రాణ ప్రతిష్ట జరిగిందని, ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలు హర్షించాయని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యమని, ఇప్పటికే మూడో సారీ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని సర్వేలు చెబుతున్నాయని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గుర్తు కమలం గుర్తుకు ఓటేసి, బీజేపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించి, నరేంద్ర మోదీని బలపరచాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి, మాజీ మంత్రి డీకే అరుణ, రాష్ట్ర కోశాధికారి శాంతి కుమార్, జిల్లా అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర నాయకులు బి.కొండయ్య, జలంధర్ రెడ్డి, బండారు శృతి, భాస్కర్ , కర్ని స్వామి, మఖ్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ పావని మల్లికార్జున్, మండల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు కౌన్సిలర్ లు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## పనులను పరిశీలించిన పురాతత్వ శాఖ రాష్ట్ర ఉన్నత అధికారి రోహిణి



**అల్లంపూర్ మేజర్ న్యూస్:** అష్టాదశ శక్తి పీఠాలలో ఐదవ శక్తి పీఠం అయినా శ్రీ జోగులాంబ దేవి బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాల పరిసర ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పురాతత్వ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారి రోహిణి తో పాటు పురావస్తు అధికారులు మంగళవారం రోజు పనులను పరిశీలించారు. పాపనాశీశ్వర ఆలయం సంగమేశ్వర ఆలయం బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలలో జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో వివిధ అభివృద్ధి పనులను నూతనంగా చేపట్టాలని ఆలయ అధికారి చంద్రయాచారి పురాతత్వ శాఖ అధికారి రోహిణిని కోరారు. బాల బ్రహ్మేశ్వర స్వామి గర్భగుడిలో జరుగుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ ను ఆమె కోరారు. 9 నవబ్రహ్మ ఆలయాలు ఉన్న దక్షిణ కాశీలో పేరు ప్రఖ్యాతలుగాంచిన నవబ్రహ్మ ఆలయాలను గురించి పురావస్తు శాఖ రాష్ట్ర ఉన్నతాధికారి సంబంధిత శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్య మాట్లాడుతూ టెంకాయలు స్వామివారికి అభిషేకం కొరకు టికెట్ల కౌంటర్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని పురావస్తు శాఖ రాష్ట్ర ఉన్నతాధికారిని కోరి వినతి పత్రం ఇచ్చారు. పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్ వెంకటనారాయణ రెడ్డి, ఆలే జూనియర్ అసిస్టెంట్ చంద్రయ్య చారి పురావస్తు శాఖ సిబ్బంది దాదాభాష ముని వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## విగ్రహ ప్రతిష్ఠ, కళ్యాణానికి గిరిధర్ రెడ్డి కుటుంబానికి ఆహ్వానించిన చొక్కంపేట గ్రామస్తులు



**రాజాపూర్, మేజర్ న్యూస్ :** రాజాపూర్ మండలంలోని చొక్కంపేట్ గ్రామంలో ఈనెల 27 నుండి 29వ తేదీ వరకు కొనసాగుతున్న శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి సహిత, గణపతి, నవగ్రహ, నాగ, ధ్వజ ప్రతిష్ట, శివపార్వతుల కళ్యాణ మహోత్సవానికి మంగళవారం చించోడ్ గిరిధర్ రెడ్డి, జయమాలరెడ్డి గారిని, బీఆర్ఎస్ పార్టీ యువనేత చించోడ్ అభిమన్యు రెడ్డి నిశిత రెడ్డిలకు చొక్కంపేట గ్రామ పెద్దలు, మాజీ సర్పంచులు, పలువురు యువకులు, శివ స్వాములు ఆహ్వాన పత్రికలు అందజేసి శివ పార్వతుల కళ్యాణానికి ఆహ్వానించారు. గిరిధర్ రెడ్డి గారి కుటుంబాన్ని, విగ్రహ ప్రతిష

## నేటి నుండి మాదిగల జోడోయాత్ర

## - మాదిగ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్ట యాదయ్య



**పాలమూరు మేజర్‌న్యూస్:** నేటినుండి ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతగా మాదిగల జోడోయాత్రను చేపట్టనున్నామని మాదిగ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్ట యాదయ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపాలకృష్ణ తెలిపారు. మంగళవారం మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బొర్ర సురేష్‌తో కలిసి జిల్లా కేంద్రంలోని ఎనుగొండ అంబేద్కర్ విగ్రహం వద్ద జోడోయాత్ర కరపత్రాన్ని విడుదల చేశారు అనంతరం వారు మాట్లాడుతూ మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని, మాదిగల పంతం బిజెపి అంతం నినాదంతో హైదరాబాదులోని అమీర్పేట నుంచి రాష్ట్రవ్యాప్తంగా జోడోయాత్ర చేపట్టనున్నమన్నారు ఈనెల 25న సాయంత్రం నాలుగు గంటలకు మహబూబ్నగర్ జిల్లా కేంద్రానికి జోఢోయాత్ర చేరుకుంటుందని జిల్లాలోని జేఏసీ నాయకులు, మాదిగలు యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అనుపటి వెంకటయ్య, రామస్వామి, గోరింట దినేష్, సుమన్, ఉమేష్ కుమార్, సంతోష్ కుమార్, రవీందర్, రాకేష్ ,కిరణ్ ,అజయ్ కుమార్, ప్రకాష్, నరేష్ పాల్గొన్నారు.

## జాతీయ మాలల ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షులుగా కంచిమి గోపాల్



**పాలమూరు మేజం ˉన్యూస్:** జాతీయ మాలల ఐక్యవేదిక మహబూబ్నగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులుగా కంచిమి గోపాల్‌ని నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్ణం కిషన్ మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో జరిగిన ఆ సంఘం సమావేశంలో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలలు ఆర్థికంగా,రాజకీయంగా చైతన్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. వర్గీకరణ విషయంలో మాలలందరూ ఏకతాటికి వచ్చి ముక్తకంఠంలో నినదించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నూతన అధ్యక్షులుగా నియమితులైన కంచిమి గోపాల్ మాట్లాడుతూ జాతీయ మాలల ఐక్యవేదిక నిబంధనలు, నాయకుల సూచనల మేరకు మాలల అభ్యున్నతి అహర్నిశలు కృషి చేస్తానని, అవకాశం కల్పించిన రాష్ట్ర,జిల్లా నాయకులు మహిళా నాయకురాళ్ళకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా శతాబ్ది వేడుకలు

## - మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి టౌన్, మేజర్‌న్యూస్:** శతాబ్ది వేడుకలు సమాజానికి స్ఫూర్తిదాయకమని మాజీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. వనపర్తి మండల పరిధిలోని మెంటపల్లి గ్రామంలో మంగళవారం బి.ఆర్.యస్ పార్టీ రాజకీయ శిక్షణ కన్వీనర్ మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి మాతృమూర్తి మాణిక్యమ్మ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శతాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన , ఆయన సతీమణి వాసంతి మణికమ్మ ను ఘనంగా సన్మానించి, పాదపూజ నిర్వహించారు. తల్లిని ప్రేమతో చూసుకొని వేడుకలు నిర్వహిస్తున్న పురుషోత్తం రెడ్డి సోదరులను మాజీ మంత్రి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మ అందరి ఆస్థి అని త్యాగాలకు ప్రతిరూపం అమ్మ అని అన్నారు. అమ్మకంటే ఆస్తులు అంతస్తులు ముఖ్యం కాదని, ప్రతి ఒక్కరికి అమ్మ ప్రేమ తర్వాతే ఆస్తులు గుర్తుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్,శ్రీనివాస్ పూర్ మాజీ సర్పంచ్ నరసింహ మండల పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గోల్డ్ మెడల్ సాధించిన ఎంఏఎల్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆణిముత్యం



**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** స్థానిక మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ, పి.జి. కళాశాలలో 2020-22 విద్యాసంవత్సరంలో ఎంఏ ఇంగ్లీష్ విభాగంలో పాలమూరు-యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలల అన్నింటిలో అత్యున్నత ప్రతిభ కనపరిచిన నందిని అనే విద్యార్థికి పాలమూరు యూనివర్సిటి తరుపున గోతమెడల్ సాధించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. షేక్ కలందర్ బాషాగారు, ఇంగ్లీష్ డిపార్ట్ మెంట్ విభాగ అధిపతి కృష్ణమూర్తి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్. డి. నాయుడు, ఐడిఏసి - కో-ఆర్డినేటర్ డాక్టర్. పి. అవీన మంజులత, పి.జి. కోర్స్ కో-ఆర్డినేటర్ వి. మనోజ్ కుమార్, కళాశాల ఏఓ మగ్బుల్ అహ్మద్ తదితర అధ్యాపకులు గోల్డ్ మెడల్ వచ్చిన నందినికి సన్మానించి అభినందనలు తెలియజేశారు.

## నూతన మీసేవ కేంద్రాల ఏర్పాటుకు పరీక్ష నిర్వహణ



**నాగర్‌కర్నూల్ ఎడ్యుకేషన్ మెజర్ న్యూస్:** నాగర్ కర్నూల్ జిల్లా లో నూతనంగా ఏర్పాటు చేయబోయే నాలుగు మీసేవ కేంద్రాలకు కలెక్టర్ భవనంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సీతారామారావు ఆధ్వర్యంలో పరీక్షను నిర్వహించారు. జిల్లాలోని వంగూరు మండలంలో గల కొండారెడ్డిపల్లి, తాడూరు మండలం తాడూర్, కోడేరు మండలంలోని మైలారం, తీగలపల్లి, గ్రామాలకు మీసేవ కేంద్రాల నిర్వహణ కొరకు దరఖాస్తు చేసుకున్న 33 మంది అభ్యర్థులకు గాను 28 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు త్వరలో మౌఖిక పరీక్ష నిర్వహిస్తామని అదనపు కలెక్టర్ సీతారామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి బాలరాజ్ సీనియర్ అసిస్టెంట్ నజీర్ ఇడియం నరేష్ తదితరులు పరీక్ష నిర్వహణలో ఉన్నారు.

## యాక్సిడెంట్ చేసిన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష 1000 రూపాయలు జరిమానా

**గోపాలపేట మేజర్ న్యూస్ :** మోటార్ సైకిల్ అతివేగంగా నడుపుతూ ఒక వ్యక్తి మృతికి కారకుడైన లింగ స్వామికి ఏడాది జైలు శిక్ష 1000 రూపాయలు జరిమానా సెకండ్ అడిషనల్ జడ్జి జానకి విధించినట్లు ఎస్సై హరిప్రసాద్ కోర్ట్ కానిస్టేబుల్ రమేష్ తెలిపారు వివరాలు ఇలా ఉన్నాయి గోపాలపేట మండలం నర్సింగపల్లి గ్రామానికి చెందిన ఎల్లప్ప5 .8.2015 రోజు పనుల నిమిత్తం వనపర్తికి వెళ్లాలని బస్సు స్టేజ్ దగ్గర నిలిచి ఉండగా పానగల్ మండలం రేమోద్దుల గ్రామానికి చెందిన లింగస్వామి తన మోటార్ సైకిల్ అతివేగంగా నడుపుకుంటూ వచ్చి స్టేజ్ దగ్గర ఉన్న ఎల్లప్పకు ఢీకొట్టడంతో బలమైన గాయాలు కాగా అతనిని మహబూబ్నగర్ ఎస్వీఎస్ హాస్పిటల్ లో చేర్పించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు అప్పటి ఎస్సై సైదులు ఏఎస్ఐ ఇలియాస్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు ఈ కేసులో 14 మంది సాక్షులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీత జడ్జి జానకి ముందు ప్రవేశపెట్టారు వాదనలు విన్న సెకండ్ అడిషనల్ జడ్జి జానకి ఏడాది జైలు శిక్ష వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ మంగళవారం రోజు తీర్పు ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు ఇదిలా ఉండగా వనపర్తి ఎస్.పి రక్షిత కే మూర్తి కేసు ఇన్వెస్టిగేషన్ చేసిన పోలీస్ అధికారులను అభినందించారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



**ఐజ మేజర్ న్యూస్ :** మంగళవారం రోజు శ్రీ చైతన్య పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయుల పాత్ర పోషించారు అనంతరం విద్యార్థులు చక్కగా పాఠాలు బోధించడం జరిగింది. స్కూలు యాజమాన్యం కరస్పాండెంట్ మల్లికార్జున్ మరియు హెడ్మాస్టర్ సుజాత నూతన టీచర్లను అభినందిస్తూ వారి ఉన్నత భవిష్యత్తు కొరకు వారిని ఆశీర్వదించారు. విద్యార్థులు పాత్రలు పోషించారు కలెక్టర్ గా ఉషశ్రీ డీఈవో అజయ్ ఎంఈఓ స్పందన కరస్పాండెంట్ సమీర్ హెడ్మాస్టర్ పుష్పలత మరియు ఉపాధ్యాయులుగా సాయి దివ్య అబ్బాయి ఉషారాణి పల్లవి దీక్ష వీరేశమ్మ మల్లికార్జున అఖిల్ అశోక్ కేశవులు అమృత హేమలత నాని వైష్ణవి సృజన ఈశ్వరి తదితర విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థికి పాఠశాల జీవితమనేది గుర్తుండిపోతుందని ఇలాంటి కార్యక్రమాలు ప్రతి ఒక్క విద్యార్థి పాల్గొనాలని చెప్పారు.

## కౌకుంట్లలో బీరప్ప ఎల్లమ్మ దేవర్ల బండారు

**కౌకుంట్ల మేజర్ న్యూస్:** కౌకుంట్ల మండలంలో బీరప్ప స్వామి పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం బీరప్ప ఎల్లమ్మ దేవర్లు మరియు పసుపు దేవర్ల బండారు పటం వైభవంగా నిర్వహించారు. కౌకుంట్లలో పండగ వాతావరణం కనిపించింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు మహిళలు, పిల్లలు యువకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు బిఆర్ఎస్ అండగా ఉంటుంది



**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** కార్యకర్తలకు బిఆంˉఎస్ పార్టీ ఎల్లపుడు అండగా ఉంటుందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గద్వాల మండల పరిధిలోని బీరెల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త దుబ్బ బీసన్న కరెంటు షాక్ తో మృతి చెందగా బిఆర్ఎస్ పార్టీ తరపున మంజూరైన రూ.2 లక్షల చెక్కును వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు రమేష్ నాయుడు, బీచుపల్లి, లతీపురం రాజు తదితరులు పాల్గొన్నారు.

## తాహసిల్దార్‌కు శుభాకాంక్షలు : రేషన్ డీలర్లు



**అయిజ మేజర్ న్యూస్ :** జోగులాంబ గద్వాల్ జిల్లా ఐజ పట్టణ పరిధిలోని మండలం ఆఫీసులో నందు నూతనంగా ఐజకు బదిలీపై వచ్చి తహసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన జ్యోతిని ఐజ మండల రేషన్ డీలర్లు పూలే బుకే తో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల ప్రెసిడెంట్ పెద్ద శీను గద్వాల్ జిల్లా రేషన్ డీలర్ల వైస్ ప్రెసిడెంట్ కురువ రాములు భూంపురం డీలర్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## శివాలయంలో ఘనంగా మహాపడి పూజ



**పెద్దమందడి, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వెల్టూరు గ్రామంలో మంగళవారం శివాలయం దగ్గర మహాపడి పూజ కార్యక్రమాన్ని శివస్వాములు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే స్వామి వారికి వివిధ రకాల పూజలు, హోమాలు, అభిషేకాలు, భజనలు శివ స్వాములు నిర్వహించారు. మాజీ వైస్ ఎంపీపీ సాక వెంకటయ్య దంపతులు శివ స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం నృత్యాలతో శివ స్వాములు భజనలు, సంకీర్తనలు నిర్వహించారు.

## అధైర్య పడొద్దు అండగా ఉంటా : బీజేపీ రాష్ట్ర నాయకులు జలందర్ రెడ్డి



**ఊట్కూర్ మేజర్ న్యూస్ :** మంగళ వారం ఊట్కూర్ మండల పరిధిలోని కొల్లూరు గ్రామానికి చెందిన వెంకట్ రెడ్డి ఈనెల 9న అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ వెంకట్‌రెడ్డి అనారోగ్యానికి గురై మృతి చెందడం విచారకరమని అన్నారు. మృతుని కుటుంబాన్ని పార్టీ తరపున అన్ని విధాల ఆదుకుంటామని అన్నారు. జలందర్ రెడ్డి వెంబడి నర్వ బిజెపి మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మాసన్న గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, ఎల్లారెడ్డిలు ఉన్నారు.

## స్త్రీ, పురుషులు ఇద్దరు సమానమే

**వనపర్తి టౌన్, మేజర్ న్యూస్ :** స్త్రీల పట్ల వివక్షత చూపకూడదని, స్త్రీ, పురుషులు ఇద్దరు సమానమే అని, బాల కార్మిక వ్యవస్థను, బాల్యవివాహాలను, పిల్లల అక్రమ రవాణాను, పిల్లల లైంగిక వేధింపులను నిర్మూలించి అందరికీ సామాజిక న్యాయం అందించాలని రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలు చిన్నమ్మ థామస్, కొమ్మ చంద్రశేఖర్ పేర్కొన్నారు. రూరల్ డెవలప్మెంట్ సొసైటీ, కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నుండి రాజీవ్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. సీఐ నాగభూషణ్, మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సురేష్, చిన్నమ్మ థామస్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. రాజీవ్‌చౌక్ వద్ద మానవహారంగా ఏర్పడి అందరికీ సామాజిక న్యాయం లభించే విధంగా కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. శ్రీలక్ష్మి, జ్యోతి, అరుణ,విశ్వకాంత్, కన్నన్ కుమార్, రాజశేఖర్, డిగ్రీ కళాశాల సిబ్బంది, సఖి కేంద్రం సిబ్బంది, భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## వార్డుల్లో ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే పర్ణికరెడ్డి



**నారాయణపేట మేజర్‌న్యూస్ :** మార్నింగ్ వాక్ లో భాగంగా మంగళవారం ఉదయం పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి ఆకస్మిక తనిఖీ చేసి ప్రజల సమస్యలు తెలుసుకొని సానిటేషన్ పనులను పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీసీనియర్ నాయకులు కోనంగెరి హన్మంతు సదా శివారెడ్డి కౌన్సిలార్ సలీం బోయ శరణప్ప తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించాలి : జిల్లా కలెక్టర్ బి ఎం సంతోష్



**గద్వాల ప్రతినిధి, మేజర్‌న్యూస్:** విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించాలని జిల్లా కలెక్టర్ బి ఎం సంతోష్ అన్నారు. మంగళవారం గద్వాల పట్టణంలోని ఇండోర్ స్టేడియం, తేరు మైదానం లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మైదాన పరిసరాలను మరియు తేరు మైదానంలో ఖేలో ఇండియా క్రీడల కేంద్రాన్ని పరిశీలించారు. ఇండోర్ స్టేడియంలో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు. ఇండోర్ స్టేడియంలో జిమ్, షటిల్, తైక్వాండో ఇతర సదుపాయాలు కల్పించడం పట్ల కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గద్వాల పట్టణంలోని ఇండోర్ స్టేడియం, తేరు మైదానం క్రీడలకు ఎంతో అనువుగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి క్రీడలలో రాణిస్తే భవిష్యత్తులో ఉద్యోగాలకు రిజర్వేషన్ వర్తిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడలలో రాణించాలన్నారు. ఈ సందర్భంగా క్రికెట్, కరాటే, పూట్ బాల్ తదితర క్రీడలలో రాణించిన విద్యార్థులను అభినందించారు. మొట్ట మొదటిసారిగా ఇండోర్ స్టేడియం కు వచ్చిన జిల్లా కలెక్టర్ ను క్రీడల శాఖ అధికారి క్రీడాకారులు బొకే అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రికెట్ బ్యాటింగ్, షటిల్ ఆడుతూ క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి బివిస్ ఆనంద్, ఎస్ జి ఎఫ్ సెక్రటరీ జితేందర్, పూట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి విజయ్, పి ఈ టి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ, ఖేలో ఇండియా అధికారి శ్రీనివాసులు, మహిళా పిఈటి సంఘం అధ్యక్షులు హైమావతి, వీటిల సంఘం కార్యదర్శి శైలజ, టైక్వాండో రాష్ట్ర కార్యదర్శి శ్రీహరి, శ్రీనివాసులు అరుణ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశం గర్వించేదిశగా పియు ఖ్యాతిని పెంచాలి -కలెక్టర్ రవినాయక్



**మహబూబ్‌నగర్ పియు మేజర్‌న్యూస్ :** పాలమూరు యూనివర్సిటీ లో మంగళవారం ప్రధాన మంత్రి శిక్ష ఉచ్చతర్ అభియాన్ ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. నిధుల మంజూరు విషయంలో నాటి రాష్ట్ర మంత్రి శ్రీమతి డికె అరుణ సహకారం కూడా ఉందని ఆయన తెలిపారు. ఈనాడు "ప్రధాన మంత్రి శిక్ష ఉచ్చతర్ అభియాన్" పథకానికి ఎంపిక కావడం శుభ పరిణామం అని కలెక్టర్ రవి నాయక్ అన్నారు. వెనుకబడిన మహబూబ్ నగర్ జిల్లా ఈ రోజు రాష్ట్రంలోనే కాదు, దేశంలో కూడా మన పాలమూరు విశ్వవిద్యాలయం పేరు నిలవడం విశేషం అని ఆయన అన్నారు. ప్రధానమంత్రి శిక్ష ఉచ్చతర్ అభియాన్ పథకం" మన పాలమూరు విశ్వవిద్యాలయానికి రావడం అంటే మహబూబ్ నగర్ విద్యకు స్వర్ణయుగం లాంటిదని ఆయన చెప్పారు. ఈ పథకానికి పాలమూరు విశ్వవిద్యాలయం ఎంపిక కావడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి కృషి ఎంతో ఉందని కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రదాన్ , కిషన్ రెడ్డి కృషి ఉందని, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, వివిధ శాఖల అధికారులు మరియు విశ్వవిద్యాలయ అధ్యాపకులు కృషి ఫలితం అని వారందరికీ కూడా ప్రత్యేక ధన్యవాదాలు మరియు అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. ప్రధాన మంత్రి శిక్ష ఉచ్చతర్ అభియాన్ ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈరోజు చాలా ఘనమైన రోజని, ప్రతి ఒక్కరూ సంతోషించాల్సిన సందర్భం అని ఆయన చెప్పారు. నాడు ఉద్యమ సమయంలో పాలమూరు విశ్వవిద్యాలయం పురుడు పోసుకున్నదని ఆయన అన్నారు. పియు విసి ప్రో లక్ష్మీ కాంత్ రాథోడ్ మాట్లాడుతూ "ప్రధాన మంత్రి శిక్ష ఉచ్చతర్ అభియాన్" పథకానికి ఎంపిక కావడం శుభ పరిణామం అని అన్నారు. కార్యక్రమంలో మహబూబ్ నగర్ ఎంపి మన్నె శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రవి నాయక్ పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎల్ బి లక్ష్మీకాంత్ రాథోడ్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ మధుసూదన్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

# మారుమూల తండాల లంబాడీల అభివృద్ధికి కృషి చేస్తా

## - యం.ఎల్.ఏ డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి



**నాగర్‌కర్నూల్, మేజర్‌న్యూస్:** నియోజకవర్గంలోని మారుమూల గిరిజన తండాల్లోని లంబాడీల అభివృద్ధికి కృషి చేస్తానని నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి అన్నారు. నాగర్ కర్నూల్ పట్టణంలోని సాయి గార్డెన్ లో అధికారికంగా నిర్వహించిన శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాల్లో నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కే రాజేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంబాడి గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ అని ఆయన చెప్పారు. సేవాలాల్ మహారాజ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే గిరిజనుల అభివృద్ధి కొనసాగుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించేందుకు 1 కోటి నుండి 2 కోట్ల రూపాయలకు పెంచిందన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వచ్చే సంవత్సరం నాటికి నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలో బంజారా భవన నిర్మాణానికి స్థల కిటాయింపుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నాగర్ కర్నూల్ నియోజకవర్గంలోని మారుమూల లంబాడి, గిరిజనుల అభివృద్ధికి తాను కట్టుబడి ఉంటానని తన రాజకీయ ప్రస్థానం గిరిజన తండాల నుండే ప్రారంభమైందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంతకుముందు నాగర్ కర్నూల్ పట్టణంలో నిర్వహించిన బంజారా లంబాడీ గిరిజనుల ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు మన్య నాయక్ ఉత్సవ కమిటీ నాయకులు గోపాల్ నాయక్ గిరిజన ఉద్యోగ సంఘ నాయకులు రాముడు నాయక్, రాంజీ నాయక్, రామచందర్ నాయక్ నాగర్ కర్నూల్ నియోజకవర్గంలోని ఐదు మండలాల నుండి అధిక సంఖ్యలో లంబాడీల గిరిజన నాయకులు ఉద్యోగ సంఘాల నాయకులు అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో మద్యాహ్నాం భోజనంతిని 14 మంది విద్యార్థులకు అస్వస్థత

## - వాటర్ ట్యాంక్ శుభ్రం చేయడం లేదని గ్రామస్థుల ఆగ్రహం



**గద్వాల మేజర్‌న్యూస్:** గద్వాల మండలం రేకులపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మద్యాహ్నాం భోజనం తిన్న తర్వాత 14 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి విద్యార్థులకు వైద్యం అందించారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం లేదని, అందరూ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. గ్రామాలలో త్రాగునీటి ట్యాంక్‌లు అపరిశుభ్రతంగా ఉండటంతో ఈ ఘటన చోటు చేసుకుందని గ్రామస్తుల ఆరోపణలు.

# అమ్మో అంగన్వాడి గుడ్లు..



**మహమ్మదాబాద్ మేజర్‌న్యూస్:** అంగన్వాడి కేంద్రాలకు వచ్చే గుడ్లు, కుళ్లిపోయిన గుడ్లు. ఇస్తున్నారు. బాలింతలు. గర్భిణీలు ఈ గుడ్లను ఎలా తినాలి..? మేం తీసుకోం అని అంగన్వాడీ టీచర్లతో గొడవ అవపడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు. మహమ్మదాబాద్ మండల పరిధిలో ఉన్న అంగన్వాడి కేంద్రాలకు ఈనెల ఫిబ్రవరి 8.2.2004 నాడు గుడ్లు వచ్చాయి. ప్రతి సెంటర్‌లో ఉన్న విద్యార్థులకు గర్భిణీలకు బాలింతలకు టిహెచ్ఆర్ పొందే విద్యార్థులకు గుడ్లు ఇవ్వాలని కేంద్ర గవర్నమెంట్ రాష్ట్ర గవర్నమెంట్ ఆధ్వర్యంలో నడపబడుతున్న అంగన్వాడీ కేంద్రాలకు గుడ్లు సరఫరా అవుతాయి. ఈ గుడ్లని సెంటర్ నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్లు ప్రీ స్కూల్ కు వచ్చే విద్యార్థులకు బాలింతలకు గర్భిణీలకు టిహెచ్ఆర్ పొందే వారికి గుడ్లను ఇస్తారు కానీ ఈనెలలో వచ్చిన గుడ్లని నీటిలో ఉడకబెడితే గుడ్లన్నీ నీరైపోతున్నాయి. కొన్ని గుడ్లు పైకి చూస్తే మంచిగానే ఉన్న గుడ్డు లోపల చూస్తే బ్లాక్ అయిపోయింది. కంపుతో కుళ్ళిన వాసన వచ్చేస్తుంది ఇలాంటి గుడ్లను మేము ఎలా తినాలి మా విద్యార్థులకు ఏమన్నా అయితే ఎవరిది బాధ్యత అని అంగన్వాడి సెంటర్ దగ్గర విద్యార్థులు తల్లిదండ్రులు గొడవకు దిగుతున్నారు. అంగన్వాడీ టీచర్స్ మాట్లాడుతూ ఈనెల వచ్చిన గుడ్లు 50 మందికి ఇవ్వాలని ఉడకబెడితే పది మంచిగున్నాయి 40 పాడైతున్నాయని ఇలా ప్రతిరోజు జరుగుతుందని ఈ విషయాన్ని మా అధికారులకు తెలియజేశామని మళ్లీ ఉడకబెడితే మంచిగున్న గుడ్లని విద్యార్థులకు ఇస్తున్నామని టిహెచ్ఆర్ తీసుకున్నవారు కూడా గుడ్లు కూలిపోయాయని తెలుపగా ఈ విషయాన్ని కూడా అధికారులకు తెలియజేశామని మాదేం తప్పులేదని అన్నారు.అసలు అధికారులు ఇలాంటి గుడ్లని ఎలా పంపిస్తున్నారు.? ఎన్ని రోజుల గుడ్లు ఇవ్వని ముందే చూసుకోవట్లేదా .. అని అధికారులను విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు..? గత నెల క్రితం గుడ్డులో పురుగులు వచ్చాయని కొన్ని పత్రికలలో వార్త రాగ అధికారులు ఒక అంగన్వాడీ టీచర్ కి మెమో ఇచ్చారు. చెయ్యని తప్పుకు ఆమె ఆరోజు మెమో అందుకుంది మరి ఈరోజు ఇన్ని గుడ్లు ప్రతి సెంటర్లో పాడవుతున్నాయి. ఇప్పుడు మెమో ఎవరికి ఇస్తారు..? టీచర్లకా..? అధికారులకా..? కాంట్రాక్టర్ కా..? అసలు అధికారులు ఏం చేస్తున్నారు అంటూ నిలదీస్తున్న ప్రజలు..?



● గుడ్లు పాడవుతున్నాయని తెలుసుకున్నాం కాంట్రాక్టర్ గుడ్లని డైరెక్ట్‌గా ప్రతి సెంటర్కు అందిస్తున్నారు కాబట్టి గుడ్లని అంగన్వాడి టీచర్లు చూసి తీసుకోవాలి బాగాలేవు అనిపిస్తే తిప్పి పంపాలి ఈనెల గుడ్ల విషయాన్ని పై అధికారులకు తెలియజేస్తాం : **అర్బన్ సిడిపిఓ రాజేశ్వరి**

విలేకరులు కావలెను

సంచలన దినపత్రికగా పేరొందిన నేటి దినపత్రిక సూర్య లో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన విద్యావంతులకు, విలేకరులకు

మహబూబ్‌నగర్ జిల్లా :
హన్వాడ, అడ్డాకుల, భూత్పూర్
గద్వాల జిల్లా : కేటిదొడ్డి, గట్టు, రాజోలి, మానవపాడు, మల్దకల్, ఇటిక్యాల

ఏరియాల్లో అవకాశం కల్పిస్తోంది.

సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

ఆసక్తి కలిగిన వారు సంప్రదించాల్సిన నెంబరు
8008622757